
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం, 31 జూలై 2024



అన్నల ఇలాఖాలో ఐఏఎస్‌ల పర్యటన

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్, ఐటీడీఏ పీవో రాహుల్ సాహసం

- మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల వేళ అటవీప్రాంతంలో ఆరుకిలోమీటర్ల కాలినడక
- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వివాదాస్పద ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల పరిశీలన
- పోలీసు, అధికార వర్గాల్లో ఆరు గంటలపాటు ఉత్కంఠ



పోడు సాగుదార్లతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

దుమ్ముగూడెం జూలై 30: ఒక పక్క మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో పీఎల్‌జీఏ వారోత్సవాలు జరుగుతున్న వేళ.. ఇద్దరు ఐఏఎస్ అధికారులు సాహసం చేశారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో మంగళవారం వారు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల సెక్షన్ అటవీ ప్రాంతంలో పర్యటించి వివాదాస్పద ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములను తనిఖీ చేశారు. వారి పర్యటన అటు పోలీసులకు, ఇటు ఉద్యోగవర్గాలకు ఉత్కంఠ కలిగించింది. అడవిలో చెట్ల పొదలు, నీటిగుంతలతో కూడిన కాలిబాటలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఆరు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వివాదాస్పద భూములను పరిశీలించారు. ఆ భూముల వద్దకు వెళ్లి తిరిగి రావడానికి వారికి సుమారు ఆరు గంటల సమయం పట్టింది. పెద్దబండిరేవు వద్ద గల ఫారెస్టు నర్సరీ నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి, 2 గంటలకు తిరిగి వచ్చారు. భద్రాద్రి జిల్లా ఉన్నతాధికారుల పర్యటన పోలీసు అధికారులకు సవాల్‌గా మారింది. ఎట్టకేలకు వారి పర్యటన ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఏం జరిగిందంటే..

తమను వ్యవసాయం చేసుకోకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని దుమ్ముగూడెంలో మండలంలోని గౌరారం పంచాయతీకి చెందిన 23 మంది ఆదివాసీ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈనెల 30న జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేయాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్, పీఓ, ఎఫ్‌డీవో, ఆర్డీవో, డీడీ లకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఉన్నతాధికారుల పర్యటన కోసం ఒక రోజు ముందుగానే చర్ల, దుమ్ముగూడెం పీఎస్‌ల పరిధిలో ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలతో పర్యటన ప్రాంతానికి చుట్టు పక్కల అడవుల్లో ఏరియా డామినేషన్ చేపట్టారు. అలాగే పర్యటన రోజున విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

హక్కు ఉన్నంత వరకే సాగు చేయాలి

గ్రామసభల్లో తీర్మానించి మంజూరు చేసిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ హక్కు పత్రాల్లో ఉన్న విస్తీర్ణం మేరకు మాత్రమే భూమిని సాగు చేయాలని కలెక్టర్ జితేష్ పాటిల్ పిటీషనర్లకు సూచించారు. అదనంగా పోడు సాగు చేసిన భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

అడవులను ఎంత నరికినా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల్లో ఉన్న విస్తీర్ణం మేరకే భూమి దక్కుతుందని ఆదివాసీలకు అర్థమయ్యేలా వివరించారు. ఇకపై అటవీభూముల్లో పోడు నరకవద్దని సూచించారు. అటవీభూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ న్యూడెమాక్రసీ డివిజన్ నాయకుడు సతీష్ ఆధ్వర్యంలో ఆదివాసీలు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అటవీశాఖతో ఏవైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వారికి సూచించారు. కలెక్టర్, పీవో వెంట ఆర్డీవో దామోదరావు, ఎఫ్‌ఆర్‌వో కనకమ్మ, దుమ్ముగూడెం ఇంచార్జ్ తహసీల్దార్ మణిధర్, ఇంచార్జ్ ఎంపీడీవో ముత్యాలరావు ఉన్నారు.



అడవిలో నడుస్తున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి.పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, ఇతర అధికారులు



విద్యార్థినిల బంధువుల చేతుల్లో దేహశుద్ధికి గురైన ఉపాధ్యాయుడు

కీచక గురువు

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, గ్రామస్థులు
- ఇల్లెందులోని ఓ గురుకులంలో ఘటన

4



కుమారుడి మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన తల్లి

'సీతారామ' కాల్వలో పడి

బాలుడి మృతి

- ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్థుల ఆరోపణ
- న్యాయం చేయాలని మృతదేహంతో రాస్తారోకో
- భద్రాద్రి జిల్లా ఆర్లపెంటలో విషాదం

రుణమాఫీ

రైతు హ్యాపీ

ఉమ్మడి జిల్లాలో 50,319 మంది రైతులకు లబ్ధి

- రూ.400 కోట్ల మేర రుణాల మాఫీ
- మండలాల్లో రైతుల సంబరాలు
- వ్యవసాయానికి కొండంత భరోసానిచ్చిన సర్కారు నిర్ణయం



చిన్న మునగాలలో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఖమ్మం, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండో విడత రుణమాఫీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో జిల్లా రైతులోకంలో ఆనందోత్సాహాలు కనిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా పరిధిలో 33,942 మంది రైతులు రూ.262 కోట్ల 50లక్షల మేర లబ్ధిపొందారు. మొదటి విడత కింద జిల్లాలో 57,857 మంది రైతులు రూ.లక్ష రుణమాఫీలో 258 కోట్ల 25 లక్షల మేర లబ్ధిపొందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండో విడత లక్ష న్నర కింద 16,377 మంది రైతులు రూ.137 కోట్ల 21 లక్షల మేర లబ్ధిపొందారు. మొదటి విడత కింద రూ.లక్ష రుణమాఫీలో 28,018 మంది రైతులు రూ.132 కోట్ల 6 లక్షలు లబ్ధిపొందారు. ఉమ్మడి జిల్లాలో రెండు విడతలు కలిపి మొత్తం 1,36,194 మంది రైతులు రూ.790 కోట్ల 5 లక్షలు లబ్ధిపొందారు. ఉమ్మడి జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున రుణమాఫీ జరగడం ఇదే మొదటిసారి. మూడో విడతలో రెండులక్షల లోపు రైతుల రుణాలను త్వరలో మాఫీచేయబోతున్నారు.

గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడులు భారీగా పెరిగి తామరపురుగు, గులాబీ పురుగువంటి చీడపీడలతో నష్టపోతున్న రైతులకు రుణమాఫీ భరోసా ఇవ్వనుంది. మిర్చిసాగులో తామరపురుగు కారణంగా ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లుగా రైతులు దారుణంగా నష్టపోయారు. ఎకరానికి 20 క్వింటాళ్లకుపైగా దిగుబడులు రావాల్సిన మిర్చి 5 నుంచి 10 క్వింటాళ్ల లోపే వచ్చింది. లక్షనుంచి లక్షన్నర వరకు పెట్టుబడులు పెట్టినా పెట్టుబడులు రాని పరిస్థితి. పత్తిపంటకు కూడా గులాబీ పురుగు దారుణంగా దెబ్బతీసింది. ఉమ్మడి జిల్లాలో లక్షనన్నర ఎకరాల వరకు మిర్చి, మూడున్నర లక్షల ఎకరాల్లో పత్తి, మరో 4లక్షల ఎకరాలకుపైగా వరి సాగుచేస్తున్నారు. గోదావరి వరదలు, అకాలవర్షాలు, వర్షాభావ పరిస్థితులు, పలురకాల తెగుళ్లతో గడిచిన రెండేళ్లుగా రైతాంగం పెట్టిన పెట్టుబడులు రాక సతమతమవుతోంది. బ్యాంకు అప్పులతోపాటు ప్రైవేటు అప్పులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటన చేయడం, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ జరగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆయా మండలాల్లో రైతులు ప్రదర్శనలు, ర్యాలీలతో సంబరాలు నిర్వహించారు.

రుణమాఫీ సంబురాల్లో 'రాయల'

కొణిజర్ల: రెండో విడత రుణమాఫీ సంబరాలు కొణిజర్ల మండల పరిధిలోని చిన్ని మునగాల గ్రామంలో మంగళవారం రైతులు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడారు. రుణమాఫీ సాహసోపేత నిర్ణయమన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా మాఫీ చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనన్నారు. 15నాటికి పూర్తిగా రుణమాఫీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, సొసైటీ చైర్మన్ చెరుకుమళ్ల రవి, చిరంజీవి, రావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం..రూ.6,256.42 కోట్లు

ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళిక విడుదల

ఖమ్మం, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి పంటల సాగు కోసం రూ.6256.42 కోట్ల రుణాలను 4,07,453 మంది రైతులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంగళవారం బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఈ మేరకు వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. ఇందులో క్రాప్ ప్రొడక్షన్‌తో పాటు నిర్వహణ, మార్కెటింగ్ నిమిత్తం రూ.3520.55 కోట్లు 3,11,379 మంది రైతులకు ఇవ్వాలని, రైతు గ్రూపులకు రూ.1224.68కోట్లు 52,753 మంది రైతులకు ఇవ్వాలని నిర్ణయించారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, అతిచిన్న పరిశ్రమలు కలిపి మొత్తం 26,370మందికి రూ.2,591.51కోట్లు ఇవ్వాలని, ఎడ్యుకేషన్, హౌసింగ్ తదితర అవసరాల నిమిత్తం 3636 మందికి రూ.230.68కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు మొత్తం జిల్లా రుణప్రణాళిక కింద 5,51,586మందికి రూ.11,991.51కోట్లు రుణాలను అందించాలని లీడ్‌బ్యాంకు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు రుణాలను అందించనుంది. ఇందులో కూడా జిల్లాలో బ్యాంకుల వారీగా లక్ష్యం పెట్టుకుని రుణప్రణాళికను విడుదల చేశారు.

పకడ్బందీగా అమలు

- రెండో విడతలో అర్హులందరికీ వర్తించేలా చర్యలు
- ఇప్పటివరకు జిల్లాలో 91,799 మంది రైతులకు లబ్ధి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



4

రైతులు రుణమాఫీని

సద్వినియోగం చేసుకోవాలి

- ఆ సొమ్ముతో భూములను అభివృద్ధి చేసుకోవాలి
- భద్రాద్రి కలెక్టర్ జితేష్ పాటిల్
- రెండో విడత రుణమాఫీ లబ్ధిదారులకు చెక్కుల అందజేత



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న రైతు రుణమాఫీని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. రెండో విడత రుణమాఫీ-2024 నిధులను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐడీవోసీలో మంగళవారం ఏర్పాటుచేసిన రైతువేదికలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత రుణమాఫీలో భాగంగా జిల్లాలో రూ.లక్షన్నర లోపు రుణాలు ఉన్న రైతులందరికీ వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండో విడతలో 16,377మంది రైతులకు మొత్తం రూ.137,21,96,477నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రైతులు తమ ఇళ్లు, పొలాల్లో నీటి కుంటల ఏర్పాటుకు ఉపాధి పథకం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆ నీటి కుంటల్లో ప్రభుత్వం తరఫున ఉచితంగా అందించే అజోల్లా నాచు పెంపకం చేపట్టాలన్నారు. అయా నీటి కుంటలో ప్రయోగాత్మకంగా కొర్రమీను చేపలు పెంపకం చేపట్టాలని సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు చేపల పెంపకం చేపట్టి లాభాలు గడిస్తున్నారన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో రైతులు బాతులు, చేపల పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. రైతులు రుణమాఫీతో వచ్చిన డబ్బుతో తమ పొలాలను సారవంతం చేసుకోవాలన్నారు. రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు సాయం చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు అన్ని వేళలా సిద్ధంగా ఉంటారని తెలిపారు. అనంతరం రెండోవిడత రుణమాఫీ పొందిన రైతులకు కలెక్టర్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన అధికారి సూర్యనారాయణ, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, కేవీకే శాస్త్రవేత్త లక్ష్మీనారాయణమ్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి, అన్ని బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చాంబర్‌లో ఎమ్మెల్యే 'తెల్లం'

- తిరిగి గులాబీ గూటికి చేరాలని ఆ పార్టీ నేతల ఆఫర్?

5

మధిరకు నిధుల వరద



ఎర్రుపాలెం మండలం చివరి ఆయకట్టులో నీరు పారక అధ్వాన్నంగా ఉన్న సాగర్ కాల్వలు



- రాష్ట్ర బడ్జెట్లో భారీ కేటాయింపులు
- రెండో జోన్ సాగర్ జలాలకు రూ.500కోట్లు
- బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.330కోట్లు
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ.100కోట్లు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.128కోట్లు
- సొంత నియోజకవర్గంపై ఆర్థిక మంత్రి భట్టి మార్కు

మధిర, జూలై 30: ఆర్థికశాఖ మంత్రిగా శాసనసభలో తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గానికి నిధులు వరద పారించారు. ముఖ్యంగా మధిర, ఎర్రుపాలెం మండలాల చివరి సాగర్ ఆయకట్టు రైతాంగాన్ని వేధిస్తున్న సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చారు. నియోజకవర్గంలో నిర్మించనున్న బీటీ రోడ్లకు, మధిరలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు, ఇందిరమ్మ డెయిరీకి నిధులు కేటాయింపు చేసినట్లు సమాచారం.

రెండో జోన్‌నుంచే సాగర్ జలాలు

మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని భూములు నాగార్జున సాగర్‌కాల్వ చివరి ఆయకట్టు కింద ఉండటంతో దశాబ్దాలుగా సాగునీరు అందడంలేదు. ఎర్రుపాలెం మండలంలో సాగర్ కాల్వలు 54 కి.మీ. మేర ఉన్నాయి. సాగర్‌నీరు రాకపోవడంతో వ్యవసాయం బావులు, వర్షాల మీదనే ఆధారపడి సాగు జరుగుతోంది. రెండో జోన్‌నుంచి సాగర్ నీరు నేరుగా సరఫరా అయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని భట్టి అధికారం చేపట్టిన వెంటనే తొలి ప్రాధాన్యతగా ఐబీ, సాగర్ అధికారులను పురమాయించారు. అధికారులు సర్వే పూర్తిచేసి మూడో జోన్ నుంచి రెండో జోన్‌కు మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు వైరానది పైనా, కట్లేరుపైనా ఎత్తిపోతల పథకాలు, పంపుహౌజులు నిర్మించి నీటిని సాగర్ కాల్వలకు ఎత్తిపోయటం ద్వారా చివరి భూములకు నేరుగా సాగునీరు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. దీనికి రూ.800 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు రూపొందించగా, తొలివిడతగా బడ్జెట్లో రూ.500కోట్లు కేటాయించినట్లు సమాచారం.

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.330కోట్లు

ఎన్నికల వేళ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పాదయాత్ర చేసిన భట్టి.. ప్రజలనుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పలు రోడ్లకు బీటీ రోడ్లు మంజూరు చేశారు. వీటికిగాను బడ్జెట్లో పంచాయతీరాజ్ శాఖ బడ్జెట్ ద్వారా రూ.330కోట్లు కేటాయించనున్నారు. ఈ నిధులతో రోడ్ల నిర్మాణం పూర్తయితే గ్రామీణ రోడ్లన్నీ బీటీ రోడ్లుగా మారనున్నాయి.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.128 కోట్లు

మధిర మునిసిపాలిటీలో 87.5 కి.మీ. మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని భట్టి విక్రమార్క గత నెలలో ప్రకటించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వ హామీతో టీయూఎఫ్ఐడీసీ నుంచి రుణంగా రూ.128కోట్లు మంజూరు చేస్తున్నట్లు అఖిలపక్ష సమావేశంలో ప్రకటించారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ.100కోట్లు

విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకురావాలని భావిస్తున్న భట్టి విక్రమార్క అందుకు మధిర నియోజకవర్గంతోనే శ్రీకారం చుట్టారు. తొలిగా ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్, మధిర నియోజకవర్గంలో 20ఎకరాల్లో ఇంటర్‌నేషనల్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు నిర్ణయించారు. మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో 20 ఎకరాల స్థలం కూడా ఎంపికచేశారు. అందుకు ఒక్కో స్కూల్‌కు రూ.100కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తూ ప్రకటించింది.

చేయాల్సినవి ఎన్నో...

అదే విధంగా మధిర నియోజకవర్గంలో పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయింపులు చేయాలని, ఖమ్మం జిల్లాలో ఏకైక ప్రభుత్వ కళాశాలగా వున్న మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆప్తులకు, అనాథలకు వారధి

శ్రీ విద్యాభ్యాస సొసైటీ

- వీధి బాల్లో వెలుగులు నింపుతున్న బండా జగన్మోహన్ రెడ్డి
- నాడు బాల వెలుగు పాఠశాలో విద్యాబుద్ధులు
- నేడు శ్రీ విద్యాభ్యాసలో కొనసాగింపు..

మణుగూరు, జూలై 30: ప్రభుత్వం బాలవెలుగు పాఠశాల నిర్వహణ బాధ్యతలను విస్మరించినా శ్రీ విద్యాభ్యాస సొసైటీ మాత్రం మర్చిపోలేదు. బయటి నుంచి సాయం అందినా, అందకున్నా.. వీధి బాలలకు అన్నీ తానై నిర్వాహకుడు బండా జగన్మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. చివరకు సర్కాకు చేతులెత్తేసినా ఆయన మాత్రం దాతల సాయంతో బాలల భవితను బంగారుమయం చేయడానికి కృషి చేస్తూనే ఉన్నారు.

తొలుత బాలవెలుగు..

మణుగూరులో బాలకార్మికుల కోసం బాలవెలుగు ప్రత్యేక శిక్షణ కేంద్రం 2009లో ప్రారంభించారు. మణుగూరు, పినపాక, అశ్వాపురం మండల కేంద్రాల పరిధిలో అనేక మంది చిన్నారులు పలు దుకాణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవించేవారు. తల్లి దండ్రులు లేని పిల్లలు కూడా చదువులకు దూరమై భారమైన జీవితాన్ని


చదువు నేర్చుకుంటున్న చిన్నారులు

గడిపేవారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ఇలాంటి వారందరినీ బాలవెలుగు పాఠశాలకు తరలించి విద్యాబుద్ధులు నేర్పించడం ఆరంభమైంది. నాడు పాఠశాల నిర్వహణ కోసం వచ్చే నిధులు చాల తక్కువ. అవికూడా అరకొరగానే వస్తూ ఉండేవి అలాంటి గడ్డు కాలంలో కూడా పాఠశాల కొనసాగింది.

దాతల సహకారం..

పాఠశాలలో చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పడానికి నిర్వాహకుడు జగన్మోహన్‌రెడ్డి ఎంతో పరితపిస్తుంటారు. బాలవెలుగు పాఠశాల ఉపాధ్యాయుల వేతనాలు, విద్యార్థులకు భోజన వసతి కోసం దాతలు ముందుకు వచ్చారు. మణుగూరు పట్టణ ప్రముఖులు పిల్లారి శెట్టి హరిబాబు, కె. చంద్రమోహన్, ముత్యాలరావు, కె. వెంకటేశ్వరరావు తో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సింగరేణి కార్మికులు విద్యా సామగ్రితో పాటు బియ్యం, పప్పు, మంచి నూనె పోషకాహార దినుసులు అందిస్తున్నారు. సింగరేణి కార్మికులు, సేవా సమితి సభ్యులు కూడా తమ వంతు సాయం చేస్తున్నారు. ప్రముఖుల పుట్టిన రోజు వేడుకలు ఈ పాఠశాలలో నిర్వహిస్తూ పిల్లల్లో మనోధైర్యాన్ని నింపుతున్నారు. 2009 నుంచి ఆరంభమైన కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బాల వెలుగు పాఠశాల 2010లో ఆర్ఎస్‌టిపీ (రెసిడెన్సియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్‌గా రూపాంతరం చెందింది. 2020లో ఈ పాఠశాలల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది.

శ్రీ విద్యాభ్యాస ఎడ్యుకేషన్ చారిటీ ట్రస్ట్

బాలవెలుగు పాఠశాలలో 2009-20 మధ్య కాలంలో దాదాపు 1,050 మందికి జగన్మోహన్ రెడ్డి విద్యా బుద్ధులు నేర్పించారు. తర్వాత ఇలాంటి పిల్లల కోసం పాఠశాల నిర్వహణను కొనసాగించాలని ఆలోచించి శ్రీవిద్యాభ్యాస ఎడ్యుకేషన్ చారిటీ ట్రస్ట్‌ను నెలకొల్పి సేవలందిస్తున్నారు. అక్షరాభ్యాసం నుంచి ఆరో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. అనంతరం గురుకులాల్లో చేర్పించి వారి ఉన్నతికి


చిన్నారులను పాఠశాలకు తరలిస్తున్న జగన్మోహన్

పాటు పడుతున్నారు. ఇక్కడ చదివిన వారిలో డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన వారు కూడా ఉన్నారు. కుంజా అనిత డిగ్రీ పూర్తి చేసి సివిల్స్ ప్రిపేర్ అవుతోంది. పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతోంది. జగన్నాథ, మహేష్ ఎంఏ ఇంగ్లీష్ చదువుతున్నారు. మడకం సంధ్య బీఎస్సీ బీఈడీ పూర్తి చేసింది. పాయం నాగరాజు బీఏ చదివి ఆర్మీలో ఉద్యోగాన్ని పొందాడు. ఆనూష్ బీకాం కంప్యూటర్స్, కుంజా అనుష్క బీఎస్సీ, కుంజా రవి బీఏ, కుంజా పవన్ ఐటీఐ చేసి ఉద్యోగం చేస్తున్నాడు. వర్మ ఐటీఐ పూర్తి చేసి సింగరేణి మందమర్రిలో ఉద్యోగం చేస్తున్నాడు.


పండుగ సందర్భంగా ఆటాపాటా

రుగ్మతలపై ఎక్కుపెట్టిన బాణం

- చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా కొండయ్య పోరాటం
- సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రచారం
- తోటి కళాకారులతో కలిసి యువతకు ప్రబోధం

మధిర, జూలై 30: కొందరు స్వార్థపరుల స్వలాభాపేక్షకు యువత బలవుతోంది. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని 25 ఏళ్లకే ముగించేస్తున్నారు. యువతను కాపాడటానికి వైద్య ఆరోగ్య శాఖలో ఆశమిత్రగా పనిచేస్తున్న లంకా కొండయ్య తన వంతు ప్రచారానికి నడుం కట్టాడు.

సామాజిక సేవకుడు, జానపద మిమిక్రీ కళాకారుడు ఆయన వృత్తిరీత్యా విధులు నిర్వహిస్తూనే ఖాళీ సమయాల్లో, సెలవు రోజుల్లో తనకున్న బహుముఖ కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. పలువురుకళాకారులను కలుపుకొని యువతలో, విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలను వివరిస్తూ అవగాహన



కొండయ్య సేవలకు గుర్తింపుగా పోలీస్ అధికారులు అభినందస్తున్న దృశ్యం


కంచర పట్టి పాడుతున్న కొండయ్య,

కలిగిస్తున్నాడు. సమాజరుగ్మతలపై యువతను మేల్కొలుపుతున్నాడు. నో గంజాయి- నో డ్రగ్స్ అంటూ పలు కళాశాలలు, పాఠశాలలు, కూడళ్లలో కళాప్రదర్శనలద్వారా చైతన్యం కల్గిస్తున్నాడు. గుడి, చర్చి, మసీదు ఏదీ వదలకుండా బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నాడు. మత్తు పదార్థాల నిషేధంపై, చెడువ్యసనాలపై అవగాహన యుద్ధ స్వచ్ఛందంగా చేయడాన్ని పలువురు అధికారులు, అనధికారులు అభినందిస్తున్నారు.

కొండయ్య సేవలను గుర్తించిన జిల్లా పోలీస్ అధికారి, జిల్లా జడ్జ్ కొండయ్యను అభినందిస్తూ సేవాపురస్కారాలను అందజేశారు. హెచ్‌ఐవీ నిర్మూలనకు నిరంతరంగా పోరాడుతున్నకొండయ్య బాధితులకు అండగా నిలుస్తూనే మరోవైపు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జనంలోకి ఉద్యమంలా ప్రచారంలో దూసుకుపోతున్నాడు. తన వృత్తి ధర్మాన్నినిర్వర్తిస్తూ మరోవైపు ఖాళీ సమయాలు, సెలవులను సైతం స్వలాభాపేక్షలేకుండా సమాజసేవకు కేటాయిస్తూ సమాజరుగ్మతల నిర్మూలనకు తోడ్పడుతున్న కొండయ్య సేవలు అభినందనీయం.

ముఖ్యమంత్రి చిత్రాన్ని గీసిన ఎమ్మెల్యే కుమార్తెలు

- మంత్రి పొంగులేటి సమక్షంలో అందజేత


సీఎంకు చిత్రాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి దంపతుల కుమార్తెలు

సత్తుపల్లి, జూలై30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ విజయకుమార్ కుమార్తెలు నీలోత్పల, విపంచి, విరాజీ గీసి హైదరాబాద్‌లో మంగళవారం ఆయనకు అందజేశారు. స్వయంగా గీసిన చిత్రం అచ్చుగుద్దినట్లు తనవలే ఉన్నదని, తనను మంత్రముగ్ధుణ్ని చేసిన ముగ్గురిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ దీవించారు. విద్యలో ఉన్నతంగా ఎదుగుతూనే ఇలాంటి అభిరుచులను యువత అలవరచుకోవాలని, వీరిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

రేపటి నుంచి డీఈఈసెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 30: టీజీ డీఈఈసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఆగస్టు 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నగరంలోని టేకులపల్లి డైట్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లతో డీఈఈసెట్ ఆన్‌లైన్ అప్లికేషన్, హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయతోపాటు ప్రత్యేక సర్టిఫికెట్లు ఉంటే తీసుకుని హాజరుకావాలని తెలిపారు.

యూత్ ఇంటర్నేషనల్‌కు జీడీసీ సింధుప్రియ



ఖమ్మం స్పోర్ట్స్, జూలై 30: రేపటి నుంచి నేపాల్ దేశంలో జరగనున్న యూత్ ఇంటర్నేషనల్ అండర్- 17 అథ్లెటిక్స్ పోటీలకు నగరానికి చెందిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ధర్మసోత్ సింధుప్రియ ఎంపికైంది. సింధు ఇటీవల గోవాలో జరిగిన 18 వ నేషనల్ యూత్ గేమ్స్ అండర్-17 అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగు పోటీలో ప్రతిభ చూపి స్వర్ణపతకం సాధించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన సింధును కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పలువురు అధ్యాపకులు అభినందించారు. నేపాల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

తల్లిపాలే అమృతం

- పోతపాలతో అనారోగ్య సమస్యలు
- ముర్రుపాలలో పోషకాలు మెండు
- రేపటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- వారంపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 30 : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వారోత్సవాలకు సంబంధించి మంగళవారం ఉన్నతాధికారులు జిల్లా ఐసీడీఎస్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహించనున్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే పాలిచ్చేలా తల్లికి సాయం చేయాలన్నదే వారోత్సవాల ఉద్దేశం.

అమ్మపాలు అమృతం..

నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దో హదపడతాయి. ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయి. తల్లి పాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయి. అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయి. అనారోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే అపోహలు వీడి తప్పకుండా బిడ్డకు పాలు పట్టించాలి. పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే సహజ రోగ నిరోధక శక్తి కలిగేలా చేస్తాయి. లేత పసుపుపచ్చ రంగుతో కూడిన పాలను బిడ్డకు ఇవ్వడం వల్ల పసికందు మెదడు చురుకుగా పని చేయడంతోపాటు జ్ఞాపక శక్తి పెరిగేందుకు దోహదపడుతుంది. గుండె, చర్మ, సంబంధ వ్యాధులు, ఉబ్బసం, ఆస్తమా, బీపీ, షుగర్ రాకుండా చేస్తాయి.

ఆరు నెలల పాటు శిశువుకు రోజుకు 12సార్లు పాలు తాగించాలి. ఈ పాలు తాగిన పిల్లల్లో స్థూలకాయం వచ్చే



అవకాశాలు చాలా తక్కువ. కొందరు తల్లులు తమ బిడ్డలకు డబ్బా పాలు పడుతున్నారు. అలా చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా, మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తల్లిపాలతో బిడ్డకు ప్రోటీన్లు అంది మెదడు వికసించడంతోపాటు శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుంది. బిడ్డకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. పాలల్లో లాక్టోజ్ ఉండటంతో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. దీంతో బిడ్డ రక్తహీనత బారినపడకుండా ఉంటుంది. తొలిదశలో శిశువును అంటువ్యాధుల నుంచి కాపాడటమే కాకుండా మనోవికాసానికి తోడ్పడతాయి. బిడ్డకు ముర్రుపాలు పట్టడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. తల్లిపాలు పుష్కలంగా రావాలంటే గర్భిణిగా ఉన్నప్పటి నుంచి పోషక విలువల ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. గుడ్లు, చేపలు, పాలు, తాజా కూరగాయాలు, పండ్లు తీసుకోవాలి.

ఇవీ కార్యక్రమాలు..

తల్లిపాల ప్రాధాన్యం వివరిస్తారు. పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పిస్తారు. 7 నుంచి 9 నెలల గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. బాలింతలు, గర్భిణులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు పుస్తకంలో వివరాలు నమోదు చేస్తారు. ఆరు నెలల్లోపు చిన్నారులకు తల్లిపాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటారు. అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి 7 నుంచి 24 నెలల పిల్లలకు తల్లిపాలతోపాటు అదనంగా ఆహారం ఇవ్వాలని సూచిస్తారు. సమతుల ఆహారం తయారీపై అవగాహన కల్పిస్తారు.

పకడ్బందీగా రైతు రుణమాఫీ అమలు

- ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతు రుణమాఫీ పథకం పకడ్బందీగా అమలు చేస్తున్నామని, అర్హులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తవని సాంకేతికంగా ఉండే ఇబ్బందులను పూర్తిస్థాయిలో తొలగిస్తామని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. లక్షన్నర లోపు రైతు రుణమాఫీ కార్యక్రమం రాష్ట్ర అసెంబ్లీ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనమండలి స్పీకర్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రారంభించిన కార్యక్రమంలో కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ముఖ్యమంత్రి రైతు రుణమాఫీ కార్యక్రమం ప్రారంభం అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రెండు విడతల్లో జిల్లాలో 91,799 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. మొదటి విడతలో లక్ష రుణమాఫీ కింద 57,857 మందికి రైతులకు రూ.258 కోట్ల 25లక్షలు రైతు ఖాతాల్లో జమచేశామని, రెండో విడతలో లక్షన్నర రుణమాఫీ కింద జిల్లాలో 33,942 మంది రైతులకు రుణమాఫీ నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, వీటిని వచ్చేవారంలోగా జమ చేయడం జరుగుతుందన్నారు.

రుణమాఫీ అయిన రైతులకు రుణాల రెన్యువల్ కూడా చేయడం జరుగుతుందని, ఈ మేరకు వ్యవసాయాధికారులు బ్యాంకర్లకు సమన్వయం చేసుకుంటున్నారని తెలిపారు. రుణమాఫీ పథకంపై రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి పరిష్కరిస్తున్నామని కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా గ్రీవెన్సు సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. రేషన్ కార్డు రైతు రుణమాఫీ పథకానికి తప్పనిసరి కాదన్నారు. రైతు కుటుంబాన్ని గుర్తించే ఒక ప్రామాణికం మాత్రమేనని వివరించారు. భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ పథకం వర్తిస్తుందని, దీనికి 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు రైతులు తీసుకున్న రుణాలకు మాత్రమే మాఫీ అమలు చేస్తున్నామన్నారు. అనంతరం వ్యవసాయాధికారులతో సమావేశమై క్లస్టర్ పరిధిలో విన్నూత ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు, కొత్త ప్రయత్నాలు చేయాలని సూచించారు. రైతువేదికల్లో టాయిలెట్లు, ఫర్నిచర్, లైట్లు, ఫ్యాన్లు, మౌలిక సదుపాయాల కల్పించాలని ఆదేశించారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొన్నిచోట్ల రైతులకు రుణమాఫీ కావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఖమ్మంలో కర్షక సేవా సంఘం ఆంధ్రాబ్యాంకులో రుణాలు పొందిన వారికి రుణమాఫీ కావడంలేదని, ఫిర్యాదులు వచ్చాయని సాంకేతిక పరమైన ఇబ్బందులు తొలగించాలన్నారు. డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ద్వారా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందిస్తున్నామని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం హర్షించదగిన విషయమని తెలిపారు. రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందాలన్నారు. జేడీఏ విజయనిర్మల, జిల్లా సహకార అధికారి మురళీధర రావు, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఉద్యానశాఖ ఏడీ వెంకటరమణ, పలువురు బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

‘సీతారామ’ కాల్వలో పడి బాలుడి మృతి

- ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్థుల ఆరోపణ
- న్యాయం చేయాలని మృతదేహంతో రాస్తారోకో
- భద్రాద్రి జిల్లా ఆర్లపెంటలో విషాదం


ఆందోళన చేస్తున్న తల్లితండ్రులు

దమ్మపేట, జూలై 30: సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడి రెండో తరగతి చదువుతున్న ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం ఆర్లపెంట గ్రామంలో జరిగింది. ఆర్లపెంట గ్రామానికి చెందిన తేలెం మల్లేష్ కుమారుడు వరుణ్(7) స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్న భోజనం అనంతరం తోటి పిల్లలంతా పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా వరుణ్ మరో ఇద్దరు పిల్లలతో కలిసి పాఠశాల బయటికి వెళ్లి ఆడుకుని తిరిగి పాఠశాలకు వచ్చారు. అయితే వారి దుస్తులు తడిగా ఉండటంతో వరుణ్‌తో పాటు 5వ తరగతి చదువుతున్న కన్నారావు, సాయికుమార్‌లను దుస్తులు మార్చుకొని రావాలని హెచ్ఎం సంధ్యారాణి ఇంటికి పంపించింది. అయితే వారు ఇంటికి వెళ్లకుండా పక్కనే ఉన్న సీతారామ ప్రాజెక్టు కాలువ వద్దకు వెళ్లారు. ఈ కాలువలో ప్రమాదవశాత్తు వరుణ్ మునిగిపోగా భయపడ్డ ఇతర విద్యార్థులు ఇంటికి వెళ్లారు. దుస్తులు తడిగా ఉండడంతో కన్నారావు, సాయికుమార్‌ల తల్లిదండ్రులు బడినుంచి ఎందుకు వచ్చారని ప్రశ్నించడంతో పిల్లలు జరిగిన విషయాన్ని చెప్పారు. ఈ క్రమంలో వరుణ్ తల్లితండ్రులు పాఠశాలకు వెళ్లి తమ కుమారుడు ఎక్కడని హెచ్ఎంని ప్రశ్నించగా ఇంటికి పంపించినట్లు చెప్పటంతో పిల్లవాడు ఇంటికి రాలేదని వారు తెలిపారు. అయితే వరుణ్‌తో కలిసి వెళ్లిన విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో సీతారామ కాల్వలో గాలించగా వరుణ్ నీటిలో పడి ఉన్నాడు. వెంటనే బయటకు తీసి పట్వారిగూడెం వైద్యశాలకు తరలించగా వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందాడని తెలిపారు.

న్యాయం చేయాలని రాస్తారోకో

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడి బాలుడు మృతి చెందాడని, వరుణ్ కుటుంబానికి న్యాయం చేయాలని పాఠశాల ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై గ్రామస్థులు రాస్తారోకో చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయికిశోర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పారు. ఎంఈవో లక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకొని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

భద్రాద్రి వద్ద మళ్లీ పెరిగిన గోదావరి

భద్రాచలం, జూలై 30: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ తొలి ప్రమాద హెచ్చరిక స్థాయి (43 అడుగులు) దాటి ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి 9 గంటలకు 42.8అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం 10గంటల పాటు అదేస్థాయిలో నిలకడగా ఉంది. మంగళవారం ఉదయం ఏడు గంటలకు 43అడుగులకు చేరడంతో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఉదయం 9 గంటలకు 43.2 అడుగులుగా ఉన్న ప్రవాహం సాయంత్రం 6 గంటలకు 43.6 అడుగులకు పెరిగింది. నీటిమట్టం మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా మూడు రోజులపాటు వరద నీటిలో మునిగి ఉన్న భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్త కాలనీలో ఎట్టకేలకు వరదనీరు పోవడంతో బాధితులు తమ ఇళ్లకు చేరుకొని శుభ్రం చేసుకున్నారు. అయితే వరద బాధితులకు మంగళవారం కూడా పునరావాస కేంద్రంలోనే భోజనం అందించారు

కిన్నెరసానికి పోటెత్తిన వరద నీరు

పాల్వంచ రూరల్, జూలై 30: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరదనీరు పోటెత్తింది. మంగళవారం ప్రాజెక్టు నీటి మట్టం 404.60 అడుగులకుపెరిగింది. ఎగువ ప్రాంతంనుంచి 9 వేల క్యూసెక్కుల నీటిచొప్పున జలాశయానికి వరదనీరుచేరుతోంది. అసలు సామర్థ్యం 407 అడుగులుకాగా పై నుంచి వరద్రపవాహం పెరగుతుండటంతో 4గేట్లను ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు మైకు ప్రచారం చేశారు.

ఇల్లెందులో కీచక గురువు

- 9వ తరగతి విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, గ్రామస్థులు

ఇల్లెందు టౌన్, జూలై 30: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు సభ్యత మరిచి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని ఓ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో కాంట్రాక్ట్ రెసిడెన్స్ టీచర్ (సీఆర్‌టీ)గా పని చేస్తున్న అంగోత్ రాందాస్ 9వ తరగతి చదువుతున్న బాలికల పట్ల కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. అతడి ప్రవర్తనపై గత సంవత్సరం పాఠశాల హెచ్ఎం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లగా.. అప్పుడు తన తప్పును ఒప్పుకొని, పునరావృతం కానివ్వబోనని చెప్పడంతో అధికారులు అతడిని వదిలివేశారు. కానీ ఈ విద్యాసంవత్సరంలోనూ సదరు ఉపాధ్యాయుడు మళ్లీ బాలికలను వేధిస్తూ అసభ్యంగా ప్రవరిస్తుండడంతో ఇద్దరు బాలికలు ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో మంగళవారం బాలికల తల్లిదండ్రులు, బంధువులు మూకుమ్మడిగా పాఠశాలలోకి వెళ్లి అక్కడే ఉన్న ఉపాధ్యాయుడు రాందాస్‌పై దాడి చేసి దేహశుద్ధి చేశారు. ఈ సమాచారం పోలీసులకు అందడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ఉపాధ్యాయుడు రాందాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కాగా ఉపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె.పృథ్వీ డిమాండ్ చేశారు.

తొలగిన వరదనీరు

భద్రాచలం, జూలై30: భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీలో ఎట్టకేలకు వరదనీరు సమస్య తొలగింది. మూడు రోజులపాటు వరదనీరు ఉండడంతో ఇళ్ల నడుము లోతు నీళ్లలో మునిగి ఉన్నాయి. ఈక్రమంలో ‘ఆంధ్రజ్యోతి’లో ‘ఆకాలనీ ఇంకా నీటిలోనే’ అనే శీర్షికన వెలువడిన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు నీటిపారుదలశాఖ అధికారులు కొత్తగూడెం నుంచి 750 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్లను తీసుకువచ్చి, వరదనీటిని తోడారు. ఇప్పటికే ఉన్న 195 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్ల సాయంతో మొత్తం తోడారు. దీంతో మూడు రోజులుగా నడుములోతు నీళ్లల్లో ఉన్న ఇళ్లకు వరదనీటి బాధ తప్పింది. దాంతో ఇంటి యజమానులు పునరావాస కేంద్రాలకు తిరిగి వచ్చి, తమ ఇళ్లల్లో పేరుకుపోయిన బురదను శుభ్రం చేసుకున్నారు. అశోక్‌నగర్ కొత్తకాలనీ ఎగువన ఉన్న ఏపీలోని ఎటపాక వాగు వరదనీరు మత్తడి వచ్చి ఈ ప్రాంతం వైపు రాకుండా ఐదువేల ఇసుక బస్తాలను వేసి ఆకట్టను పటిష్టం చేసినట్లు నీటిపారుదలశాఖ ఈఈ రాంప్రసాద్ తెలిపారు.


అశోక్‌నగర్ కొత్తకాలనీలో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న మహిళ

జోరుగా మట్టి దందా

- ప్రభుత్వ వైద్య కాలేజీ అనుమతి పొందిన సమీప ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు
- ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మైనింగ్‌శాఖ అధికారులు

రఘునాథపాలెం, జూలై 30: ప్రభుత్వాలు మారినా రఘునాథపాలెం మండలంలో అక్రమ మట్టి మాఫియాకు అడ్డుపడడం లేదు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వం వైపు మట్టి మాఫియా మారిపోతుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గుట్టలను అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని కాంగ్రెస్ నాయకులు, సామాజిక కార్యకర్తలు పోరాటాలు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలు, గుట్టలతో పాటుగా ప్రభుత్వ వైద్య కాలేజీకి కేటాయించిన భూములకు సమీపంలోని భూములను మట్టి మాఫియా వదిలిపెట్టటం లేదు. పగటి సమయంలో గుట్టు చప్పుడుగా ఉండే మట్టి వ్యాపారులు, సాయంత్రం అయ్యిందంటే చాలు అత్యంత బలమైన యంత్రాలను వినియోగించి అక్రమ మట్టి వ్యాపారం చేస్తున్నారు. జోరుగా మట్టి వ్యాపారం జరగడంతో అక్రమ మట్టి వ్యాపారుల మధ్య విభేదాలు మొదలుకావడంతో, ఒకరి వాహనాలపై మరోకరు ఫిర్యాదులు చేసుకునే వరకు వెళ్లింది.

అయితే గతంలో మట్టి మాఫీయాకు అనుకూలంగా వ్యవహరించిన కొందరు నాయకులు ఇప్పుడు మాత్రం తాము ఎవ్వరికీ సిఫార్సులు చేయడం లేదని, తమ పేర్లు ఎవ్వరైనా వాడితే, వారిపై మరో కేసు పెట్టాలని పోలీసులు, మైనింగ్‌శాఖ అధికారులకు సూచిస్తున్నారు.

ఖమ్మం నగరంలో జరిగే నిర్మాణాలకు ఖమ్మం అర్బన్ ప్రాంతంతో కలిసి ఉన్న రఘునాథపాలెం ప్రధాన మట్టి వ్యాపార మార్గం. ఖమ్మం నగరం నుంచి ఇల్లెందు, వైరా ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులకు గతంలో రఘునాథపాలెం పరిధిలో ఎత్తైనా కొండలు కనిపించేవి. అయితే గత ప్రభుత్వంలో జాతీయ రహదారుల నిర్మాణం పేరుతో కొద్ది పాటి భూముల కు అనుమతి పొంది, వందల ఎకరాల్లో అక్రమ మట్టి వ్యాపారం జరిగింది. దీంతో అనేక గుట్టలు ఇప్పుడు గుం తలుగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇదే మట్టి మాఫీయా తిరిగి కాంగ్రెస్ పార్టీ అనుచరులుగా మారా రు. ఇక కొద్దో గొప్పో మిగిలిన గుట్టలను మిం గారు. చెరువుల్లో రైతు పేరుతో అనుమతులు పొంది, 20నుంచి 30 అడుగుల లోతుగా యంత్రాలను వినియోగించి, చెరువు మట్టిని సైతం రియల్‌ఎస్టేట్ వెంచర్లకు తరలించారు. అంతటితో ఆగకుండా, ప్రభుత్వ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారులకు కేటాయించిన భూముల్లో అక్రమంగా మట్టి గ్రావెల్ తొలకాలు జరిపారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని భవిష్యత్ తరాలకు మంచి వైద్య సేవలు అందాలని ఖమ్మం ప్రభుత్వ వైద్య కాలేజీని రఘునాథపాలెం సరిహద్దులో నిర్మాణం చేసేందుకు అనుమతులు తీసుకున్నారు. ఈ మేరకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పగటి సమయంలో కాలేజీకి కేటాయించిన భూముల్లో నిర్మాణ సంస్థ భూమి చదును పనులు చేస్తున్నాయి. కానీ మట్టి మాఫీయా గత వారం రోజులుగా ప్రభుత్వ వైద్య కాలేజీ కేటాయించిన భూముల సమీప ప్రాంతాలపై కన్నేసింది. రాత్రి సమయంలో భారీ యంత్రాలను వినియోగించి మట్టి అక్రమ తొలకాలు జరుపుతున్నారు.

రెండు లారీలను సీజ్ చేశాం:

● సాయినాథ్, ఏడీ, మైనింగ్‌శాఖ

మండలంలో కొయచెలక ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి వ్యాపారం జరుగుతున్న రెండు లారీలను ఇప్పటికే సీజ్ చేశాం. జాతీయ రహదారులకే మాత్రమే మట్టి తరలింపు అనుమతి ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కేటాయించిన ప్రాంతం నిర్మాణ సంస్థకు అప్పగించాం. చదును చేసే పనులు జరుగుతున్నాయి. సమీప ప్రాంతాల్లో మట్టి తోలకాల విషయం మా దృష్టికి రాలేదు. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే వారిపైన చర్యలు తీసుకుంటాం.



ప్రభుత్వ వైద్య కాలేజీ కోసం అనుమతి పొందిన ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ఒకరి వాహనాలపై మరోకరు ఫిర్యాదులు

ఖమ్మం నగరంలో మట్టి, గ్రావెల్‌కు విపరితమైన డిమాండ్ పెరగడంతో మూడు మట్టి మాఫియా ముఠాలు అక్రమ మట్టి వ్యాపారం జోరుగా సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఒకరిపై మ రోకరు పై చెయ్యి సాధించే క్రమంలో ఒకరి వాహనాలపై మరోకరు ఫిర్యాదులు చేసుకోవడంతో ఇటీవల రఘునాథపాలెం పో లీసులు రెండు మట్టి లారీలను సీజ్ చేసి స్టేషన్‌లో ఉంచారు.

మట్టి మాఫియా దళారులను అడ్డుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ నిర్మాణాలకు అనుమతి పొందిన స్థలాల్లో కూ డా మట్టి తొలకాలకు అక్రమ మట్టి మాఫియా బరితెగిస్తొం దని విమర్శలు వెలువడుతున్నాయి.

'సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు'



మెదక్‌లో జరిగిన ఆయిల్‌పామ్ రైతు శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా రైతులు

అశ్వారావుపేట, జూలై 30: సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని మెదక్ జిల్లా తునికి కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శంబాజీ దత్తాత్రేయ మల్కార్ అన్నారు. మంగళవారం ఉద్యానశాఖ సౌజన్యంతో మహారాష్ట్రకు చెందిన ఎంఎస్ లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో తునికి భారతీయ వ్యవసాయ పరిశోధన మండలిలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు. మారుతున్న జీవన వైవిధ్యం అనుగుణంగా రైతులు తమ వ్యవసాయ సాగు పద్ధతులను అవలింబించాలని అశ్వారావుపేట పామాయిల్ గ్రోవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తుంబూరు మహేశ్వరరెడ్డి, పుల్లయ్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకె మేనేజర్ కృష్ణ, సైంటిస్టులు శ్రీకాంత్, రవి, భారతి, రాజా, రైతులు తుమ్మ రాంబాబు, తగరం జగన్నాథం, సంతపురి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ కళాకారులకు హనుమా అవార్డులు



అవార్డు అందుకుంటున్న రోశయ్య చౌదరి

పాల్వంచ టౌన్, జూలై 30: ప్రముఖ రంగ స్థల కళాకారులు, పాల్వంచ వాసులు, పాకాలపాటి రోశయ్య చౌదరి, భాషా హనుమా అవార్డులు సాధించారు. ఈ నెల 20 నుంచి 28 వరకు తిరుపతి మహతి ఆడిటోరియంలో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటకోత్సవంలో ఈ అవార్డులు పొందినట్లు మంగళవారం వారు తెలిపారు. పౌరాణిక నాటక విభాగంలో ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన బ్రహ్మర్షి విశ్వమిత్ర నాటకంలో విశిష్టునిగా ప్రధాన పాత్ర పోషించిన రోశయ్య చౌదరికి ఉత్తమ సహాయ నటుడుతో పాటు హను అవార్డు, అదే నాటకంలో భటుడు పాత్ర పోషించిన బాషాకు సైతం హనుమ అవార్డు దక్కింది. తమకు అవార్డులు అందజేసిన అభినయ ఆర్ట్స్ సంస్థ అధినేత బీఎన్. రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు సాదించిన చౌదరి, బాషాలను, పాల్వంచ కళాకారులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

ఈవో వర్సెస్, ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్

- కొందరిమాటలు నమ్మి తనను బదిలీ చేస్తున్నారంటూ ఈవో సులోచన ఆవేదన
- సమస్యలపై ఎకరువు పెడుతూ ఎండోమెంట్ కమిషర్‌కు వినతి

కొత్తగూడెం సాంస్కృతికం, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెంలోనే ప్రఖ్యాతిగాంచిన దేవాదాయ ధర్మదాయ శాఖకు చెందిన కొత్తగూడెంలోని శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్) ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న కే. సులోచన బదిలీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. టెంపుల్ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ మాటలు విని, తనను తప్పుబడుతూ వివరణను కూడా వినకుండా అర్థాంతరంగా బదిలీ చేస్తూ ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు ఆదేశాలు జారీ చేయడం పై ఈవో సులోచన ఎండోమెంట్ కమిషనర్‌కు వినతి పత్రంలో వివరాలు వెల్లడిస్తూ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఎండోమెంట్ పరిధిలోని పలు సత్రాలకు చెందిన భూములను అన్యాక్రాంతం కాకుండా చూస్తున్నందుకు, తాను అడ్డుగా ఉన్నానని భావించి కొందరు బడాబాబులు డిప్యూటి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్‌కు జరుగుతున్న విషయాల పై ఫోన్ ద్వారా తెలియపర్చేందుకు ప్రయత్నించినప్పటికీ తన మాటలు వినకుండ, తనను వెంటనే డీసీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని బదిలీ చేయడం బాధాకరమన్నారు. కొందరి ఆరోపణలు విని డిప్యూటీ కమిషనర్ బదిలి అస్త్రాన్ని వాడి కావాలనే తనను తప్పించడం ఆక్రమణదారులకు వత్తాసు పలకడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనను మధ్యంతరంగా బదిలీ చేయడంతో తన పిల్లలు చదువులకు ఆటంకం కలుగుతుందని, తనను ఒక సంవత్సర కాలం గణేష్‌టెంపుల్‌లో విధులు నిర్వర్తించుకునేందుకు అవకాశం కల్పించాలని ఎండోమెంట్ కమిషనర్‌ను వినతిప్రతంలో కోరారు. ఈ విషయాలను నేరుగా వివరించేందుకు ఈవో సులోచన హైదరాబాద్ తరలివెళ్లారు. అనేక ఏళ్ల నుంచి వివాదాల్లో ఉన్న దేవాదాయశాఖ భూములు అక్రమణదారుల నుంచి స్వాధీనపర్చుకోవాల్సిన అధికారులే, ఆక్రమణ దారులకు మద్దతు పలకడంపై ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

గణేష్ టెంపుల్ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రజనీకుమారి

ఎండోమెంట్ అధికారుల ఆదేశాల మేరకు రజనీకుమారి మంగళవారం కొత్తగూడెంలో శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)కు ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రస్తుతం పెద్దమ్మతల్లి ఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 30: మెడికల్ కళాశాలలో పనిచేసేందుకు అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంటాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఖాళీ పోస్టుల్లో ప్రొఫెసర్లు-9, అసోసియేట్ ప్రొఫెసర్లు-11, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-7, మొత్తం 27 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 16 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో నలుగురిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో శిక్షణ కలెక్టర్ మృణాల్‌మిశ్రా, డీఎంహెచ్‌వో డాక్టర్ బి. మాలతి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటర్వ్యూ ద్వారా జిల్లా సెలక్షన్ కమిటీ నేతృత్వంలో ఎంపిక చేసిన వీరికి నియామకపు పత్రాలను అందజేశారు. వివిధ పోస్టులకు ఎంపికైన వీరిని పలువురు అభినందించారు.

సీనియర్ వైద్యుడు కుమారస్వామి మృతి

● సూపరింటెండెంట్ విధుల్లో చేరాల్సిన ముందు రోజే ఘటన



కుమారస్వామి

వరంగల్ మెడికల్, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెం ప్ర భుత్వ ఆస్పత్రి పూర్వ సూపరింటెండెంట్, మంచిర్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన డాక్టర్ బోడ కుమారస్వామి సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన ఆయన గతంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సర్జికల్ విభాగంలో సుదీర్ఘకాలంపాటు సేవలు అందించారు. ఆ తరువాత పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో మంచిర్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అయితే మంగళవారం మంచిర్యాలలో జాయిన్ కావాల్సి ఉండగా, సోమవారం రాత్రి ఆయన తన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికలో మంగళవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించగా.. ఆయన మృతి పట్ల పలువురు ఐఎంఏ వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సంతాపం ప్రకటించారు. ఇదిలా ఉంటే కొత్తగూడేనికి చెందిన కొందరి వేధింపుల వల్ల తన భర్త తీవ్ర ఆవేదనకు గురై మృతిచెందాడని ఆయన భార్య విలపించిన ఓ వీడియో వైరల్‌గా మారింది.

మావోయిస్టు పోస్టర్ కలకలం

ఇల్లెందుటౌన్, జూలై 30: ఇల్లెందు పట్టణంలో మావోయిస్టు పోస్టర్ కలకలం రేపింది. మంగళవారం రాత్రి పట్టణంలోని కొత్తబస్టాండ్ సెంటర్‌లో ఓ స్తూపానికి మావోయిస్టుల పోస్టర్ వెలువడం చర్చనీయంశంగా మారింది. అమరవీరుల వారోత్సవాలను నిర్వహించాలని పోస్టర్లలో పేర్కొన్నారు.

విద్యార్థిపై కుక్క దాడి

ముదిగొండ, జూలై 30: ముదిగొండ మండలం అమ్మపేటలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిపై ఓ పిచ్చికుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన మూడోతరగతి చదువుతున్న మోదుగుల వరుణ్‌తేజ్ పాఠశాలకు వెళ్తుండగా కుక్క దాడి చేసింది. ఈ ప్రమాదంలో వరుణ్‌తేజ్‌కు తీవ్రగాయాలు కాగా, కుటుంబ సభ్యులు వెంటనే విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పనుల అనుమతికి అధికారుల వేధింపులు

- ● మునిసిపల్ కాంట్రాక్టర్ కట్టా వెంకట నారాయణ ఆరోపణ
- ● ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు వెల్లడి

పాల్వంచ టౌన్, జూలై 30: పాల్వంచ మునిసిపాలిటీలో టెండర్ల ద్వారా తాను దక్కించుకున్న పనుల అనుమతి ఇవ్వకుండా మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని మునిసిపల్ కాంట్రాక్టర్ కట్టా వెంకట నారాయణ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. రూ.4లక్షల లోపు పనులను దక్కించుకున్న పనులను ఆపని చేయనీయకుండా, వేరే కాంట్రాక్టర్‌తో పని చేయించారని ధ్వజమెత్తారు. తాను గతంలో చేసిన కొన్ని పనుల తాలూకు బిల్లుల చెల్లింపులో సైతం బిల్లులు ఇవ్వడానికి నానా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. డీఎంఎఫ్‌టీ ఫండ్ రిలీజ్ చేయాలంటే కలెక్టర్ కార్యాలయంలో 2శాతం కమిషన్ ఇవ్వాలని చెప్పి, కొంతమంది కాంట్రాక్టర్ల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పనుల క్లియరెన్స్‌పై ఏఈ, డీఈతోపాటు మునిసిపల్ కమిషనర్‌ను కలిసినా ఫలితం లేకుండపోయిందని వాపోయారు. వీటన్నింటిపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులందరికీ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి ఎంబీబీఎస్ మొదటి ఏడాది పరీక్షలు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 30: జిల్లా మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆగస్టు 1 నుంచి వార్షిక పరీక్షలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1నుంచి 12 వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికోసం కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ షెడ్యూల్‌ను ప్రకటించినట్లు పేర్కొన్నారు.

దళ సభ్యులను వెంటనే కోర్టులో హాజరుపరచాలి

●మావోయిస్టు పార్టీ జేఎండబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి వెంకటేష్ పేరిట లేఖ

పినపాక, జులై 30: భద్రాద్రి జిల్లా చర్ల పోలీసుల చెరలో నిరాయుధులుగా ఉన్న మా వోయిస్టు పార్టీ ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ దళ సభ్యులను తక్షణమే కోర్టులో హాజరుపరచాలని సీపీఐ మావోయిస్టు పార్టీ జయశంకర్-మంచిర్యాల-వరంగల్-పెద్దపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ మంగళవారం లేఖ విడుదల చేశారు. చర్ల పోలీసుల అదుపులో జైసింగ్, రమేష్, సుక్కీ ఉన్నారని, వీరు ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ దళ సభ్యులని, వీరిలో జైసింగ్, రమేష్‌లను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారని, సుక్కీని మంగళవారం అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. వీరిని కనబడకుండా దాచి విచారణ పేరుతో చిత్రహింసలకు గురి చేసి ఎన్‌కౌంటర్ పేరుతో చంపేందుకు ప్రయత్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురు సభ్యులను 24 గంటల్లోగా కోర్టులో హాజరుపరచాలన్నారు. వారికి హాని తలపెడితే కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక నాయకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని లేఖలో హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి మృతి



లక్ష్మి(ఫైల్)

నేలకొండపల్లి, జూలై30: కాంగ్రెస్ నాయకురాలు, నేలకొండపల్లి గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు కొమ్మనబోయిన లక్ష్మి ఎలియాస్ బాబులక్ష్మి(60) మంగళవారం మృతి చెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు. కాంగ్రెస్ నుంచి రెండు సార్లు నేలకొండపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలిగా ఎన్నికయ్యారు. మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, సీపీఐ జిల్లా నాయకుడు, మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు బొందయ్య, రామచంద్రాపురం సహకార సంఘం అధ్యక్షుడు గూడవల్లి రాంబ్రహ్మం, రామాంజనేయరెడ్డి, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బీటీపీఎస్‌లో ప్రమాదం

కార్మికుడికి తీవ్ర గాయాలు

మణుగూరు, జూలై 30: మణుగూరు మండలంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో మంగళవారం నాలుగో యూనిట్ వద్ద జరిగిన ఓ ప్రమాదంలో నాగుల్ మీరా అనే కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. నాగుల్ మీరా యూనిట్ నాలుగు వద్ద విధులు నిర్వహిస్తున్న క్రమంలో, శాంపిల్ వాటర్ ప్రమాదవశాత్తూ కాళ్లపై పడింది. దీంతో కార్మికుడికి కాళ్లకు తీవ్రస్థాయిలో గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈవిషయం పై బీటీపీఎస్ సీఈ బిచ్చన్నను వివరణ కొరగా.. ప్రమాదం పెద్దది కాదని, సహజంగా చిన్నచిన్నవి జరుగుతూనే ఉంటాయన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆ కార్మికుడు బాగానే నడుస్తూ విధులకు హాజరయ్యాడని తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడు...

మణుగూరు, జూలై 30: షార్ట్ సర్క్యూట్‌తో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సింగరేణి ఓసీ-2 గని ఎస్అండ్‌డీ సెక్షన్‌లో పని చేసే కార్మికుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మణుగూరుకు చెందిన రామ్మోహన్(52) తన భార్య జోష్నరాణితో కలిసి స్థానిక ఆస్పత్రికి కారులో వెళ్తుండగా, ప్రమాదవశాత్తూ కారులో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇరువురిని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం, అనంతరం హైదరాబాద్ తరలించారు. కాగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రామ్మోహన్ మృతి చెందాడు.

గోడపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

ఖమ్మం క్రైం జూలై 30: గోడ మీద నుంచి పడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల బయ్యారం మండలం బండ్లకుంటతండాకు చెందిన భూక్యారాము(47) మద్యానికి బానిసై రెండు నెలలుగా కుటుంబాన్ని వదిలి నగరంలో ఒంటరిగా ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం పాత బస్టాండ్ గోడపై నుంచి దిగుతూ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అక్కడున్న పండ్ల వ్యాపారులు అంబులెన్స్ ద్వారా నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సిద్ధార్థ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో గిరిజనుడు ?

- ● ఇంట్లో ఓ తుపాకీ లభ్యం !
- ● భద్రాద్రి జిల్లా దామరతోగులో ఘటన

గుండాల, జూలై 30: ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం-ములుగు జిల్లాల సరిహద్దులోని దామరతోగు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటన మరువకముందే దామరతోగు గ్రామానికి చెందిన ఓ గొత్తికోయ గిరిజనుడి ఇంట్లో అయుదాలు లభ్యమైయ్యాయనే సమాచారంతో ఏజెన్సీ గ్రామాల్లో అలజడి నెలకొంది. ఈనెల 25న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగు, ములుగు జిల్లా తాడ్వాయి మండలం అల్లిగూడెం సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన అశోక్(25) అలియాస్ విజేందర్ మృతి చెందిన విషయం తెలిసిందే.. కాగా ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన మొల్కం ముఖేష్ తన తండ్రి భీమాతో పాటు గత కొంత కాలంగా దామరతోగులో నివాసం ఉంటూ ఓ రైతు దగ్గర పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. అయితే ముఖేష్ ఇంట్లో ఆయుధాలు ఉన్నాయనే పక్కా సమాచారంతో సోమవారం రాత్రి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని ఇంట్లో తవ్వి దాచి పెట్టిన తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా పోలీసుల అదుపులోని వ్యక్తి మావోయిస్టు సానుభూతి పరుడా, అతడి వద్దకు తుపాకీ ఎలా వచ్చిందనేది తెలియాల్సి ఉంది. అయితే ఇటీవల జరిగిన ఎన్‌కౌటర్‌లో తప్పించుకున్న మావోయిస్టులు చర్ల మండలంలో పట్టుబడటంతో వారు ఇచ్చిన సమాచారంతో గిరిజనుడి ఇంట్లో సోదాలు చేసి ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే గిరిజనుడిని అదుపులోకి తీసుకున్న విషయం తమ దృష్టికి రాలేదని గుండాల పోలీసులు చెబుతున్నారు. కాగా మరో పక్క ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాలు నిర్వహిస్తుండగా స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలు అడవుల్లో ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు.

కేసీఆర్ చాంబర్‌లో భద్రాచలం ఎమ్మెల్యే

- తిరిగి గులాబీ గూటికి చేరాలని ఆ పార్టీ నేతల ఆఫర్ ?
- సున్నితంగా తిరస్కరించిన ఎమ్మెల్యే తెల్లం
- రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చ



టీఆర్‌ఎస్ నేతలతో కూర్చున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలం, జూలై 30: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అసెంబ్లీ ప్రాంగణంలోని ప్రతిపక్ష నేత కేసీఆర్ చాంబర్‌లో ప్రత్యక్షం కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనమైంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఉన్న భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను బీఆర్‌ఎస్ కీలకనేత ఒకరు మాట్లాడుతూ కేసీఆర్ చాంబర్‌లోకి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో సదరు నేత ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి రావాలని ఆహ్వానించినట్లు తెలిసింది. ఆయనపై పెట్టిన కేసు ఉపసంహరించుకుంటామని, ఆర్థికంగా భరోసా ఇస్తామని సదరు నేత ఇచ్చిన ఆఫర్‌ను ఎమ్మెల్యే వెంకట్రావు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. పొరపాటున కూడా మళ్లీ తప్పుడు నిర్ణయం తీసుకోనని, రాజకీయం లేకపోయినా పర్వాలేదుగానీ మళ్లీ బీఆర్‌ఎస్‌తో కలబోనన్నారు. చావో.. రేవో కాంగ్రెస్‌తోనే తన ప్రయాణం ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు సైతం అక్కడే ఉండగా వారితో సైతం ఎమ్మెల్యే ఇదే విషయం చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కేసీఆర్ చాంబర్‌లో ఎమ్మెల్యే వెంకట్రావ్ ప్రత్యక్షం కావడం రాజకీయవర్గాల్లో సంచలనంగా మారింది. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఉపేందర్(ఫైల్)

టేకులపల్లి, జూలై 30: అప్పుల బాధ తాళలేక మండలంలోని కోయగూడెంలో మంగళవారం ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన జాల ఉపేందర్(33) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ నాలుగేళ్ల క్రితం అప్పుచేసి మరో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిలో వ్యవసాయం చేయగా పంట దిగుబడులు రాక ఇంకా అప్పుల పాలయ్యాడు. ప్రస్తుతం అతడికి సుమారు రూ.15లక్షల అప్పులున్నాయి. భూమి కొనుగోలుకు చేసిన అప్పు ఎలాతీర్చాలని ఆందోళనకు గురై కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యా డు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటి నుంచి పొలానికి వెళ్లిన అతడు అక్కడ క్రిమిసంహారక మందు తాగి పడిపోయాడు. కాగా సమీప పొలంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి జాల పెద్దలాలయ్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మనస్తాపంతో మహిళ...

ఖమ్మం క్రై జూలై 30: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఖమ్మం నగరంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పార్శికబంధంలో నివసించే పస్తం జ్యోతి(30) ఇటీవలే తన భర్తతో కలిసి లండన్‌కు వెళ్లివచ్చారు. అక్కడ వాతావరణం పడక ఆమె అనారోగ్యానికి గురై నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలు తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ...

ఆళ్లపల్లి, జూలై 30: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం అనంతోగు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతోగు గ్రామానికి చెందిన గలిగే సాంబశివరావు(36) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది మంగళవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వ్యక్తి అంత్యక్రియలను అడ్డుకున్న గ్రామస్థులు

● రెబ్బవరంలో ఘటన

వైరా, జూలై 30: ఓ వ్యక్తి ఖననాన్ని కొందరు గ్రామస్థులు అడ్డుకున్న సంఘటన మండల పరిధిలోని రెబ్బవరం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్.ఖాసీంసాహెబ్(40) తన భార్య తనను వదిలి వెళ్లిపోయిందని మనస్తాపంతో సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. కాగా మంగళవారం అతడి ఖననాన్ని నిర్వహించేందుకు గ్రామంలోని వివాదస్పదంగా ఉన్న కబరస్థాన్ స్థలంలో ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, గ్రామంలోని ఓ వర్గం వారు ఆ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, గిర్దావర్-2 శ్రీకాంత్ అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఇది తమ సొంత స్థలాలు అని, అందువలన ఎట్టిపరిస్థితుల్లోనూ కబరస్థాన్‌కు ఈ స్థలాన్ని ఇచ్చేది లేదని కొంతమంది స్పష్టం చేశారు. చివరికి చెరువు సమీపంలోని వేరే స్థలంలో అంత్యక్రియలు నిర్వహించారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వంశీకృష్ణ

విద్యుదాఘాతంతో ఇళ్లు దగ్ధం

● ఇద్దరు మహిళలకు గాయాలు

వేంసూరు, జూలై 30: విద్యుదాఘాతంతో ఇళ్లు దగ్ధం కాగా, ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని రామన్నపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని రామన్నపాలెం గ్రామంలో చుక్క హరిబాబు ఇంట్లో సోమవారం రాత్రి అందరూ నిద్రపోతుండుగా అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు చేలరేగాయి. దీంతో ఇంట్లో నిద్రపోతున్న హరిబాబు భార్య రోజా, కుమార్తె వైష్ణవిలు మంటల్లో చిక్కుకోని తీవ్రంగా గాయపడ్డారు. మంటలకు ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని హైదరాబాద్ తరలించారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ రాజు పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు.

జూలూరుపాడులో చోరీలు

● నగదు, బంగారం అపహరణ



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జూలూరుపాడు, జూలై30: జూలూరుపాడు పంచాయతీ పరిధిలోని న్యూకాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు చోట్ల చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. న్యూకాలనీకి చెందిన సమందల నాగేశ్వరరావు ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువా తాళాలను పగులగొట్టారు. బీరువాలో ఉన్న బంగారంతో పాటు రూ.50 వేల నగదును ఎత్తుకువెళ్లారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఓ బడ్డీ కొట్టు తాళాన్ని పగులగొట్టి రూ.2 వేల నగదును తీసుకెళ్లారు. న్యూకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం తాళాన్ని పగులగొట్టి వస్తువులు ఏమి తీసుకోకుండా దొంగలు పారిపోయారు. బాధితుడు నాగేశ్వరరావు చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాలను జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రాణా ప్రతాప్‌లు పరిశీలించి వివరాలు నమోదు చేసుకు న్నారు. నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఐయూటీసీ మండల అధ్యక్షుడిగా శివకృష్ణ

జూలూరుపాడు, జూలై 30: ఏఐటీయూసీ నూతన మండల కమిటీని మంగళవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కొత్తూరు పెద్దహరిజనవాడ గ్రామానికి చెందిన గార్ల పాటి శివకృష్ణ మండల అధ్యక్షుడిగా వెంగన్నపాలెం గ్రామానికి చెందిన షేక్ చాంద్‌పాషాను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా గుడిమెట్ల సీతయ్య, వర్కింగ్ ప్రెసి డెంట్‌గా వల్లమల్ల సామేలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పత్తిపాటి మహేష్, ఉపాధ్యక్షులు సిలివేరు నరసింహారావు, ఎస్‌కె.ఖరీముల్లా, కొట్టే శ్రీనివాసరావు, రామారావు, నిమ్మటూరి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శులుగా భూక్యా లలిత, కత్తి గోపి, ముదిగొండ లక్ష్మీ, మల్కం వీరభద్రం, ఊడల శ్రీనివాసరావులతో పాటు, కోశాధికారిగా బాజోత్ పార్వతిని ఎన్నుకున్నారు.



శివకృష్ణ, చాంద్‌పాషా

అరకొరగా విద్యా, వైద్య సౌకర్యాలు

» ఏజెన్సీలో ప్రజలకు సౌకర్యాలు అందడంలేదని సభ్యుల ఆరోపణ » వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

పాల్వంచ రూరల్, జూలై 30: పాల్వంచ ఏజెన్సీ మండలంలోని ప్రజలకు విద్యా, వైద్యం అరకొరగా అందుతుందని అధికారులు దృష్టి సారించాలని మంగళవారం పాల్వంచ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ఎంపీటీసీలకు ఇది చివరి సర్వసభ్య సమావేశం కావడంతో పలు ప్రజా సమస్యలను లేవనెత్తారు. పాఠశాలలకు సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వసూళ్లు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఎంఈవోను కోరారు. గ్రామీణ ప్రాంతంలో ప్రబలుతున్న జ్వరాలను అరికట్టేందుకు వైద్యులు స్థానికంగా ఉంటు వైద్యసేవలు అందించాలని అన్నారు. ఈ సీజన్‌లో దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, మలేరియా జ్వరాలు వస్తున్నాయన్నారు. దోమతెరలను పంపిణీ చేయాలని ఎంపీటీసీలు కోరారు. వైద్యాధికారులు పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరస్వతి

కొత్వాలకు సన్మానం..

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్, మార్క్‌ఫెడ్ రాష్ట్రకమిటీ మెంబరు కొత్వాల శ్రీనివాసరావును సన్మానించారు. ప్రభుత్వం నుంచి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేయాలని కొత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మడవి సరస్వతి, జడ్పీటీసీ సభ్యులు బరపాటి వాసుదేవరావు, మండల ఉపాధ్యక్షులు గురవయ్య, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల సంబురాలు

» వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల సందేశాన్ని వీక్షించిన అన్నదాతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు




పినపాక, సుజాతనగర్, టేకులపల్లిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సందేశాన్ని వింటున్న రుణమాఫీ పొందిన రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

అశ్వాపురం జూలై 30: ఎన్నికల సందర్భంగా ప్రజలు కు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మంగళవారం రెండో విడత రుణమాఫీ సందర్భంగా మండల పరిధిలోని మల్లెలమడుగు రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు అయిన 8నెలలకాలంలోనే ఆరు గ్యారెంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బేతం రామకృష్ణ, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మొండికుంట ఎంపిటిసి కమటం నరేష్, మండల ఏవో సాయి శంతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●టేకులపల్లిలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఉండేటి ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, మండల వ్యవసాయశాఖ అధికారి అన్నపూర్ణ, సీఈవో ప్రేమాచారి, ఏఈవోలు శ్రావణి, రమేష్, ప్రవీన్, రైతులు పాల్గొన్నారు.

●అశ్వారావుపేటలో ఏఓ నవీన్, అశ్వారావుపేట, నారాయణపురం సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

●చంద్రుగొండలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రూ లక్షన్నర లోపు రుణమాఫీ చేయటంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రెండో విడత రుణమాఫీ నిధులు విడుదల చేశారు. రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● కరకగూడెం: ఏవో చటర్జీ, ఏఈవోలు ప్రశాంత్, అనిల్, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి, ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్ పోలెబోయిన తిరుపతయ్య, రాందాస్, గొగ్గలి బాటయ్య, శ్రీరామ్ చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

● పినపాక : పినపాక మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీసీ లో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల ప్రసంగాలను మంగళవారం రైతులకు చూపించారు. వ్యవసాయ శాఖ ఏఓ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, ఏఈఓలు కొమరం లక్ష్మణ్‌రావు, కే రమేష్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాధం, నాయకులు జి వెంకటరెడ్డి, ఎండీ బషీరుద్దీన్, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, బండారు సాంబశివరావు, అచ్చా నవీన్ రైతులు పాల్గొన్నారు.

●సుజాతనగర్‌లో జరిగిన రుణమాఫీ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి నర్మద, ఎంపీపీ పద్మావతి, మండల వ్యవసాయాధికారిణి జి. నర్మద, ఏఈఓ శరత్, రైతులు చింతలపుడి శేఖర్, మడిపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

●పాల్వంచ రూరల్: మండల వ్యవసాయ అధికారి ఎస్. శంకర్‌రావు రైతులు పాల్గొన్నారు.



అశ్వారావు పేట, చంద్రుగొండలో పాల్గొన్న రైతులు

సబ్‌జైల్‌ను సందర్శించిన జూనియర్ సివిల్ న్యాయాధికారి

ఇల్లెందు టౌన్, జూలై 30: ఇల్లెందు పట్టణంలోని సబ్‌జైల్‌ను జూనియర్ సివిల్ న్యాయాధికారి మేదరపల్లి కీర్తి చంద్రికరెడ్డి మంగళవారం సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలకు మెను ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేదో అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండ పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచితంగా లీగల్‌ఎయిడ్ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎస్. చంద్రశేఖర్, సిబ్బంది, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్ పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న న్యాయాధికారి

బదిలీపై వెళ్లిన పశువైద్యాధికారికి సన్మానం

దమ్మపేట, జూలై 30 : దమ్మపేట మండలంలో 17సంవత్సరాలు పాటు పశు వైద్యునిగా విధులు నిర్వహించి బదిలీపై ఖమ్మంజిల్లా వనంరామకృష్ణారావుపాలెం గ్రామానికి పశువైద్యాధికారిగా వెళ్ళిన రమేష్‌బాబు దంపతులను స్థానిక రైతువేదిక వద్ద ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి స్వప్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంగళవారం పసువైద్యసిబ్బంది, రైతులు, ప్రజాప్రతినిధులు పలువురు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసి పైడి వెంకటేశ్వరరావు, సొసైటి చైర్మన్ ఎల్లిన రాఘవరావు, వైస్ ఎంపీపి దారా మల్లికార్జునరావు, అంకత మహేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, పగడాల రాంబాబు, కేవి సత్యనారాయణ, గూడపాటి వెంకట్రావు, సదాశివరావు సత్యనారాయణ, సైదా, చిన్నంశెట్టి సత్యనారాయణ, దారా ప్రసాదు, సాయి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


పశువైద్యాధికారి దంపతులను సత్కరిస్తున్న గ్రామస్థులు

విద్యార్థికి అస్వస్థత

● రహదారి నిర్మాణం లేక తీవ్ర ఇబ్బందులు

ములకలపల్లి, జూలై 30: మండలంలోని తాళ్లపాయి గ్రామానికి చెందిన సడియం రమ్య. వెంకటేష్ దంపతుల కుమారుడు రిహాన్స్‌కు మంగళవారం ఫిడ్స్ వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. అత్యవసర పరిస్థితుల్లో రహదారి నిర్మాణం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాత్కాలికంగా నిర్మించిన రైలింగ్ వంతెన కూడ మధ్యలో ఉన్న పిల్లర్ కుంగిపోయింది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదకరంగా ఉన్న రైలింగ్ వంతెనపై దాటారు.


విద్యార్థినిని తరలిస్తున్న దృశ్యం

రోడ్డు మరమ్మతులు చేసుకున్న గ్రామస్థులు

ఆళ్లపల్లి, జూలై 30: ఆ ఊరికి వేళ్లే రోడ్డు మరమ్మతుల కోసం ఎవరో వస్తారు ఏదో చేస్తారన్న ఆశలేకుండా ఊరి జనం ఒక్కటై రోడ్డు మరమ్మతులు చేసుకున్నారు. ఆళ్లపల్లి మండలం, మర్కోడు పంచాయతీ, పాతూరు గ్రామానికి 50 ఏళ్లకు పైగా దారి లేదు ఒకపక్క జల్లేరు, మరో పక్క సెటుగారి చెరువు అలుగు ఒర్రె ఉంది. గత మండల పరిషత్ ఎన్నికల్లో గ్రామస్థులు రోడ్డు ఏర్పాటు చేయాలని ఎన్నికలు బహిష్కరించగా మర్కోడు సర్పంచ్ హామీతో పెద్దూరు నుంచి పాతూరుకు రోడ్డు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మధ్యలో సెటుగారి అలుగుఒర్రె వరదకు ప్రతీ ఏడాది రోడ్డు తెగిపోవడం, మళ్లీ వేసవిలో పనులు చేయడం పరిపాటిగా మారింది. ఇటీవలే కురిసిన వానలకు అలుగు వరదకు రోడ్డు మరమ్మత్తులకు గురికావడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దాంతో మంగళవారం గ్రామస్తులు ఏకమై ఒర్రె దగ్గర గుంతలును పూడ్చినారు. ఈ దారికి గతేడాది ఐటీడీఏ నుంచి నిధులు కేటాయించింది కాని పనులు ప్రారంభం కాలేదు.


రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న గ్రామస్థులు

పోస్టల్ పథకాలతో ప్రయోజనాలు

దుమ్ముగూడెం జూలై 30: పోస్టల్ పథకాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎన్నో ప్రయోజనాలున్నాయని భద్రాచలం పోస్టల్ ఏఎస్పీ ఐఅశోక్‌కుమార్ అన్నారు. గ్రామీణ, చిన్నమొత్తాల పొదుపు, సేవింగ్ ఖాతా, పీపీఎఫ్, టీడీ, ఎస్సీఎస్ఎస్, ఎంఎస్ఎస్‌సీ, రికరింగ్ డిపాజిట్ పథకాలతో అధిక వడ్డీ పొందవచ్చన్నారు. ఆర్‌పీఎల్‌ఐలో తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ అందుతుందన్నారు. ఎస్పీఎం వివేక్, ఎంఓలు ఆనందగోపాల్, దుర్గాప్రసాద్, కోటరెడ్డి, సాగర్, శ్రీను, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్ట భద్రత కల్పించాలి

చుంచుపల్లి, జూలై 30: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్ట భద్రత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కూలీలైన్‌లో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రదాన మంత్రి నరేంద్రమోదీ తాము అదికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్ట భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి పదేళ్ళ గడిచినా దానిని నెరవేర్చకుండా మాదిగలను మోసగించారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు బిరియా భీమ్‌రామ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జానీ, సురేష్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం పాఠశాలలో తిధి భోజనం

దుమ్ముగూడెం జూలై 30: ప్రజల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తిదిభోజన పథకాన్ని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించే సదుద్దేశంతో ప్రారంభమైన ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బిశ్రీనివాసరావు అన్నారు. పాఠశాల చైర్‌పర్సన్ పూజారి రత్నకుమారి, ఐకేపీ సభ్యులు కృష్ణవేణి, దుర్గారాణి, వెంకటనర్సమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం

ఆర్‌సీపేట ఆశ్రమపాఠశాలలో విచారణ

దుమ్ముగూడెం జూలై 30: రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమపాఠశాల నుంచి సామగ్రి తరలింపును స్థానిక ఆదివాసీలు అడ్డుకున్న వ్యవహారంపై ఏటీడీవో అశోక్ మంగళవారం విచారణ చేపట్టారు. ఈనెల 27న ఎటువంటి అనుమతుల్లేకుండా పాఠశాల నుంచి టేబుళ్ల, బల్లలు, పుస్తకాలను వాహనంలో తరలిస్తున్నారంటూ స్థానిక ఆదివాసీ పెద్దలు, యువకులు దాన్ని అడ్డుకున్నారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో విచారణ ఆలస్యమైంది. జరిగిన సంఘటనపై టీచర్లు, విద్యార్థుల నుంచి వివరాలు సేకరించి పీఓకు నివేదిక పంపుతామని ఏటీడీఓ అశోక్ తెలిపారు. విచారణ నిస్పక్షపాతంగా చేసి తరలింపుకు బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

డ్రైవర్ కుటుంబానికి చేయూత


ఆర్థిక వితరణ చేస్తున్నడ్రైవర్లు

ఇల్లెందు టౌన్, జూలై 30 : ఇటీవల సింగరేణి కన్వీనేన్స్ డ్రైవర్ శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితే. ఆయన కుటుంబానికి మంగళవారం ఇఫ్టూ అనుబంధ డ్రైవర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో రూ.50వేలు అందించారు. మృతి చెందిన డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ షావలి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు పాయం వెంకన్న, గోపీ, అలీ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో రెండు పశువుల మృతి

ఆళ్లపల్లి, జూలై 30: రెండు పశువులు మృతి చెందిన సంఘటన ఆళ్లపల్లి మండలంలో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని చింతోనిగుంపు గ్రామంలోని రామకృష్ణకి చెందిన ఒక ఆవు, ఒక దుక్కిటేద్దును లక్ష్మీపూరం గ్రామానికి చెందిన ఎట్టి శ్రీను అనే రైతు అద్దెకు(కిరాయికి) తీసుకున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే శ్రీను తనకు ఉన్న పశువులతో పాటు అద్దెకు తీసుకున్న పశువులను మంగళవారం మేతకు తీసుకెళ్లగా సాయంత్రం సమయంలో ఒక ఆవు, ఒక ఎద్దు మృతి చెందాయి. ఎదైన విష ఆహారం తిన్నాయా..? లేక పాము కరిచిందా అనే కారణాలు ఇంక తెలియలేదు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత

మణుగూరు, జూలై 30: మణుగూరు ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగుల కోసం బస్ పాస్ మంజూరి మేళాను నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్టీసీ డిపో మేనేజర్ కె శ్యాంసుందర్ ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. రాయితీ బస్ పాస్ లతో డీలక్స్ బస్సులు, ఎక్స్‌ప్రెస్,పల్లెవెలుగు బస్సుల్లో 50 శాతం రాయితీపై రాష్ట్రమంతా ప్రయాణాలు సాగించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొనగా వారిని డీఎం అభినందించారు. అనంతరం బస్ పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి కనకదుర్గ, శ్రీనివాస రావు, సీహెచ్ ఉపేంద్ర, తాటి సుధాకర్, డిఐ పీవీ రెడ్డి పాస్‌కౌంటర్ నిర్వాహకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బస్ పాసులు అందిస్తున్న డీఎం శ్యాంసుందర్

రేపు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

బూర్గంపాడు, జూలై 30: బూర్గంపాడు మండల పరిషత్ కార్యలయంలో టీజీఎస్‌ఆర్టీసీ భద్రాచలం డిపో ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1న(గురువారం) ఉదయం 10గంటలకు మేళా ప్రారంభమవుతుందని తెలిపారు.రాయితీ బస్‌పాస్‌ల కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్సు, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటోతో పాటు రూ.50లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు విలేజ్ బస్సు ఆఫీసర్లు 7382857119, 9492309101, 9849560226 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

చుంచుపల్లి, జూలై 30: 'తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్' విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో గరిమెల్లపాడు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి సురేష్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం సీతారాములు, ఉపాధ్యాయులు అరుణ, పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో జ్వరాల సర్వే నిర్వహించాలి: డీఎంహెచ్‌వో

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై30: వైద్య, పంచాయతీ సిబ్బంది గ్రామాలలో పర్యటించి జ్వరపీడితుల గుర్తింపుకై సర్వేను చేపట్టాలని డిఎంఅండ్‌హెచ్‌వో ఎల్.భాస్కర్‌నాయక్ తెలిపారు మంగళవారం వైద్య, పంచాయతీ సిబ్బందితో జూమ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్య పనులను ముమ్మరంగా చేసి అపరిశుభ్రతను తొలిగించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అదికారులు డాక్టర్ స్పందన, డాక్టర్ చైతన్య, ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంపు ఆపరేటర్ మృతి

అశ్వారావుపేట, జూలై 30: అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోటగిరి రామకృష్ణ,(75) పంపు ఆపరేటర్ మంగళవారం మధ్యాహ్నం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈయన 30సంవత్సరాలుగ పంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తు అందరికి సుపరిచితుడు. ఈయన మృతిపట్ల పంచాయతీ ఈఓ హరికృష్ణ, పంచాయతీ సిబ్బంది, పలువురు పట్టణవాసులు ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేసారు.

రోడ్లపైనే మురుగునీరు..

» డ్రెయినేజీ లేక ఇబ్బందులు

» అవస్థలు పడుతున్న దమ్మక్క పేట వాసులు

మణుగూరు రూరల్, జూలై 30: మండలంలోని దమ్మక్కపేట గ్రామంలో సమస్యలు తాండవిస్తోన్నాయి. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామం పరిస్థితి. ఐదేళ్లక్రితం కొత్తగా గ్రామపంచాయతీగా ఏర్పటడంతో తమ సమస్యలు తీరుతాయని ప్రజలు ఎన్నో కలలు కన్నారు.. దమ్మక్కపేట గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వరద నీరంతా రోడ్డుపై నుంచి ఇళ్లలోకి పారుతుండటంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. వర్షాలు వచ్చి వచ్చి ఒక్క సారిగా ఆగిపోవడం మూలంగా నిలిచిన నీటితో మురికి గుంతలు తయారు అవుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ , మలేరియా వంటి విష జ్వరాల భారిన పడి ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. గ్రామంలో ఉన్న ప్రదాన రహదారులతో పాటు అనుసంధాన వీధుల్లో ఎక్కడా పటిష్టమైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడ మురిగి నీరు అక్కడే నిరు నిల్వ ఉండటం గ్రామం మురికి కూపంలా తయారైంది. గ్రామం చెంతనే బీటీపీఎస్ ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్లాంట్ నిర్మాణ దశలో సీఎస్ఆర్ నిధుల నుంచి నిర్వాసిత గ్రామాలను అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇచ్చిన హామీలను మరిచారు. కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థలేక వీధులపై కి నీరు చేరి మురికి కూపాలు తయారు అవుతున్నాయని ఆవేధన చెందుతున్నారు. దోమల వృద్ధితో రోగాల భారిన పడుతున్నామని ఇప్పటికైనా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రదాన వీధిలో రోడ్డు పై పారుతున్న వరదనీరు

ఇళ్లలోకే వర్షం నీరు: చీకట్ల హరిబాబు, దమ్మక్క పేట



గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థల లేక కురుస్తున్న వర్షాలకు పడిన వరద నీరంతా ఇండ్లలోకే వస్తున్నాయి. మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు ప్రజా ప్రతనిధుకు ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదు. ఇకనైనా డ్రైనేజీలను ఏర్పాటు చేయాలి

ప్రజాప్రతినిధులకు పట్టదా: బిళ్ల జోగేశ్వరరావు, స్థానికుడు



ఎన్నికలు వస్తే ఓట్ల కోసం ఇళ్లచుట్టూ తిరిగే ప్రజా ప్రతినిధులకు మా సమస్యలు పట్టించుకోవడంలేదు. డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగు కుంటల్లోలో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలను తీసుకోవాలి.

సింగరేణిని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

» బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

కొత్తగూడెం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో జరుగుతున్న సింగరేణి పరిరక్షణ యాత్రముగింపు బహిరంగసభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. ఈ బస్సుయాత్రకు సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, రాష్ట్రకమిటి సభ్యులు భూపాల్, ఆశయ్యలు నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. మంగళవారం మంచికంటిభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బొగ్గుగనులను వేలం వేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో సింగరేణి సంస్థకు ఇవ్వాల్సిన బొగ్గు బ్లాక్‌లను వేలంలోపెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఒక వైపు వేలం వేస్తూ మరో వైపు సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సింగరేణి సంస్థనురక్షించుకునేందుకు సీపీఎం నిర్వహిస్తున్నపోరాటంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. ఆగస్టు 3 నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ఆగస్టు 5న కొత్తగూడెం రైల్వేస్టేషన్ వద్ద జరిగే బహిరంగసభలో ముఖ్య అతిథిగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ విజయరాఘవన్, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పోతినేని సుదర్శన్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కొలగాని బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, ఎం. బాలనర్సారెడ్డిలు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల అరెస్టు


ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఆశా వర్కర్లు

ఇల్లెందు టౌన్, జూలై 30: తమ సమస్యల పరిష్కారం కోసం ఛలో హైదరాబాద్ వెళ్తున్న ఆశావర్కర్లను మంగళవారం ఇల్లెందు పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నబీ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కూడా అక్రమంగా అరెస్టులు చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే పద్ధతిని అవలంభిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సహయ కార్యదర్శి చీమల రమణ, తాళ్లూరి కృష్ణ, చంద్రకళ, సావిత్రి, అమల, నాగలక్ష్మి, మణెమ్మ, ఝాన్సీ, రాంబాయి, కళా, కౌసల్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

జూలూరుపాడు, జూలై 30: మండలంలోని పాపకొల్లు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శివాలయం కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు మంగళవారం పండ్లను పంపిణీ చేశారు. ఎంఈవో గుగులోత్ వెంకట్ చేతుల మీదుగా పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు పౌష్టికాహారంగా అరటి పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మీరా సాహేబ్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.